క్లుప్తంగా

నేటి నుంచి సత్తెమ్మతల్లి జాతర

గండేపల్లి: మండలంలోని పి.నాయకంపల్లిలో శనివారం నుంచి సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు మలిరెడ్డి పాపారావు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు గాజువాకకు చెందిన రాజుబాయ్ ఈవెంట్‌తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు.

రోడ్లపై వ్యర్థాలు వేయవద్దు

తుని: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు వ్యర్థాలను రోడ్లపై వేయవద్దని కమిషనర్ ప్రసాదరాజు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. రోజువారీ విధులు నిర్వహించే కార్మికుల సంఖ్య తక్కువగా ఉంటుందని, రోడ్లు శుభ్రపరచడానికి ఇబ్బంది లేకుండా ప్రజలు సహకరించాలన్నారు. ఇళ్లు, వ్యాపారులు, హోటల్స్, కూరగాయల వ్యాపారులు పారిశుధ్య కార్మికులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. తడి, పొడి చెత్త సేకరణకు ఇచ్చిన డస్ట్‌బిన్లను వినియోగించాలని సూచించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



ఏలేశ్వరంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దుర్గావెంకటప్రసాద్

ఏలేశ్వరం: లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్‌జోన్స్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పట్టణ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అలమండ దుర్గావెంకటప్రసాద్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తున్న లయన్స్ క్లబ్‌ను ఏర్పాటు చేసిన మెల్విన్ జోన్స్ చిరస్మరణీయుడని అన్నారు. పేదలకు ఆయన చేసిన సేవలు అపూర్వమన్నారు. నేటి యువత జోన్స్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఉడతల రమణారావు, కందుల ప్రభాకర్, మజ్జి సత్యప్రసాద్, అలమండ పెదచలమయ్య, గూనాపు అప్పలరాజు పాల్గొన్నారు.

125 మందికి వైద్య పరీక్షలు

జగ్గంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని జగ్గంపేట గ్రామ ఉపసర్పంచ్ బండారు రాజా సూచించారు. జగ్గంపేటలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గౌతమి 120 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



పి.నాయకంపల్లి హైస్కూల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు

గండేపల్లి: మండలంలోని పి.నాయకంపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 1998 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ రంగాల్లో వేరు వేరు చోట్ల స్థిరపడినప్పటికీ వారంతా తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడిగా గడిపారు. కార్యక్రమంలో మలిరెడ్డి పాపారావు, సురేఖ, కిషోర్, కందుల శ్రీను, ప్రసాద్, సౌజన్య పాల్గొన్నారు.

ఫ్యాన్సీ షాపులో చోరీ

రౌతులపూడి: మండలంలోని బంగారయ్యపేట శివారున గుర్రాల నానిబాబు అనే దివ్యాంగుడికి చెందిన ఫ్యాన్సీ షాపులో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. షాపు వద్ద ఎవరూ లేకపోవటంతో గుర్తు తెలియని దుండుగులు షాపు తాళాలు పగులగొట్టి రూ.1.8 లక్షల విలువ చేసే సామగ్రిని చోరీ చేశారని బాధితుడు నానిబాబు వాపోయాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. నానిబాబుకు రెండు కాళ్లు పనిచేయకపోవటంతో గత కొంతకాలంగా గ్రామశివారున ఫ్యాన్సీ షాపు నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ తరుణంలో షాపులో ఉన్న సామాగ్రి చోరీకి గురి కావడంతో నానిబాబు బోరున విలపించారు.

చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు వనదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు అమరేశ్వర ఘనపాఠీ, సత్యకోట శ్రీనివాస్, చిట్టెం వాసు, నగేష్, వ్రతపురోహితులు కొంపెల్ల మూర్తి, కూచుమంచి ప్రసాద్ తదితరులు పూజలు నిర్వహించారు.

సంక్రాంతి వచ్చిందే తుమ్మెద

- సొంతూళ్లకు చేరుకుంటున్న ప్రజలు
- కిక్కిరిసిన రైళ్లు, బస్సులు
- మార్కెట్‌కు సంక్రాంతి శోభ



తుని రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ



తుని మార్కెట్ మెయిన్ రోడ్డులో జనం సందడి

తుని: గ్రామాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. పెద్ద పండగను కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆత్మీయుల నడుమ జరుపుకునేందుకు జనం సొంతూళ్లకు చేరుకుంటున్నారు. ఉద్యోగ, వ్యాపార, ఇతర రంగాల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన అందరూ కన్నతల్లి లాంటి ఉన్న ఊరుకు ఉత్సాహంగా వస్తున్నారు. రైళ్లు, బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. శనివారం భోగి కావడంతో శుక్రవారం కుటుంబ సమేతంగా సొంతూళ్లకు వెళుతున్నారు. పండగను పురస్కరించుకుని దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. ఆర్టీసీ పలు పట్టణాలకు పండగ సర్వీసులను నడుపుతోంది. ఇక ప్రైవేటు బస్సుల నిర్వాహకులు టికెట్ ధరలను రెట్టింపు చేశారు. పండగ ముసుగులో దోపిడీ చేస్తున్నారు. త్వరగా గమ్యానికి చేరుకోవాలన్న ఆత్రుతతో ఎంతైనా చెల్లించి వస్తున్నామని ప్రయాణికులు చెబుతున్నారు.

గ్రామాల్లో సందడి

సంక్రాంతి పండగకు పల్లెలు సిద్ధమయ్యాయి. ప్రజలు ఇళ్లకు రంగుల వేసి సుందరంగా ముస్తాబు చేశారు. మహిళలు కొత్త అల్లుళ్లు, కుమార్తెలు, మనుమల కోసం పిండివంటలను సిద్ధం చేస్తున్నారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని గ్రామాల్లో రంగవల్లికలు, సాంస్కృతిక ప్రదర్శనల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల్లో పందెం రాయుళ్లు కోడి పందేలకు బరులను సిద్ధం చేశారు. తుని నియోజకవర్గం పరిధిలోని 45 పంచాయతీల్లో కోడిపందాలు నిర్వహిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. పండుగ మూడు రోజుల పాటు అనధికారికంగా అనుమతులు ఇచ్చారు.

మార్కెట్‌లో సందడి

పండగ సమయం కావడంతో తుని పట్టణం జన సంద్రంగా మారింది. వంద గ్రామాలకు ప్రధాన కేంద్రం కావడంతో దుస్తులు, కిరాణా, ఫ్యాన్సీ ఇతర వస్తువుల కొనుగోలుకు వేలాది మంది తుని వస్తున్నారు. దీంతో మెయిన్ రోడ్డులో రద్దీ నెలకొంది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ కోసం చర్యలు తీసుకున్నా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పంటలు పుష్కలంగా పండడంతో రైతులు, కార్మికులుపండగకు కొత్త దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. యువత రెడీమేడ్ దుస్తులను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. దీనికి అనుగుణంగా వందల సంఖ్యలో దుకాణాలను ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో అన్ని రకాల వ్యాపారాలు కలిపి రూ.100 కోట్ల మేర అమ్మకాలు జరిగినట్టు అంచనా. ఇక శనివారం భోగి కావడంతో ప్రధాన ప్రాంతాల్లో కలపను సిద్ధం చేశారు. భోగి మంటల కోసం ప్రత్యేకంగా పిడకల దండలను సిద్ధం చేశారు. రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపేందుకు ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పోలీసులు మాత్రం ప్రజలు ఇళ్ల వద్దనే సంబరాలు జరుపుకోవాలని, పేకాట, గుండాట, కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆటోల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు.

భోగికి సర్వం సిద్ధం



ప్రత్తిపాడు ఇందిరా కాలనీలో భోగిమంటకు సిద్ధం చేసిన కలప

ఏలేశ్వరం: భోగభాగ్యాలు కలిగించే భోగి పండగను శనివారం జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. యువకులు భోగిమంటలకు కలప వేటలో నిమగ్నయయ్యారు. గ్రామ పొలిమేరలు, పొలాల్లో పెద్దపెద్ద చెట్ల కొమ్మలు, మానులు తెచ్చి పోగు చేశారు. పిల్లలు తెలవారుజామునే నిద్రలేచి తలస్నానం చేసి నూతన వస్త్రాలు ధరించి తాము ఆవుపేడతో చేసిన భోగి పిడకలను మంటల్లో వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఏలేశ్వరం పట్టణంలోని పెద్దవీధి, పల్లపువీధి, తోటవీధి, దిబ్బలపాలెం, తదితర ప్రాంతాల్లో భోగి మంటలకు కలపను సిద్ధం చేశారు. మండలపరిధిలోని లింగంపర్తి, యర్రవరం, పెద్దనాపల్లి, సిరిపురం గ్రామాల్లో ముఖ్యకూడల్లో భారీగా భోగిమంటలు వేయనున్నారు. మహిళలు తమ ఇళ్ల వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేశారు. గ్రామాల్లో ఉదయం నుంచి హరిదాసు కీర్తనలతో భక్తిభావం పెంపొందుతోంది.

ప్రత్తిపాడు: గ్రామాలకు సంక్రాంతి శోభ నెలకొంది. శనివారం జరుపుకునే భోగి పండగకు గ్రామాల్లో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ మంటకు కలపను సేకరించే పనిలో పడ్డారు. పనికి రాని వస్తువులను భోగి మంటలకు ఆహుతి చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. చిన్నారులు భోగి పిడకల తయారీలో నిమగ్నమయ్యారు. కాగా గ్రామాల్లోని ప్రతి పల్లె రంగు రంగుల రంగవల్లులతో సుందరంగా దర్శనమిస్తున్నాయి. హరిదాసుల రాగాలాపనలు, పగటి వేష కళాకారుల గానామృతాన్ని ప్రజలు ఆస్వాదించారు.



ఏలేశ్వరంలో భోగిమంటకు సిద్ధం చేసిన కలప

రాచ క్రీడకు రంగం సిద్ధం

'రాచ'క్రీడకు రహస్య ప్రదేశాలు సిద్ధమవుతున్నాయి. పౌరుషానికి ప్రతీకగా పేర్కొనే కోడి పందాల్లో పాల్గొనేందుకు పలువురు మీసాలు దువ్వుతున్నారు. సంక్రాంతి పర్వదినాల్లో ఈ పందాలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తున్నదే. కాగా ఈ ఏడాది కోడి పందాల నిర్వాహణపై పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు. ఇప్పటికే పల్లెల్లో జూదాల జోలికి పోవద్దంటూ హెచ్చరికలు కూడా చేశారు. అయినప్పటికీ మారుమూల ప్రాంతాల్లో పందాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

జూదాలు ఆడితే కఠిన చర్యలు

తుని: పట్టణ ప్రజలు సంక్రాంతి పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తుని పట్టణ సీఐ ఎం.నాగ దుర్గారావు ఆకాక్షించారు. తునిలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పండగ సందర్భంగా కోడిపందాలు, గుండాట, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండగ సమయంలో ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు వివరాలను పోలీసులకు తెలియ పరచాలన్నారు. ఇంటిలో విలువైన బంగారు వస్తువులు, నగదు ఉంచవద్దని, సమాచారం ఇచ్చిన ఇంటి యాజమానులకు ప్రత్యేక యాప్‌ను ఇన్‌స్టాల్ చేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లో పోలీస్ నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. మార్కెట్‌కు వచ్చే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే అందుబాటులో ఉన్న పోలీసులకు తెలియపరచాలన్నారు. పట్టణ పరిధిలో మెయిన్ రోడ్డుతో పాటు రద్దీగా ఉండే ప్రదేశాల్లో ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన వివరించారు.

కోడి పందేల బరుల ధ్వంసం

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు కోడి పందాల కోసం ఏర్పాటు చేసిన బరులను ధ్వంసం చేసినట్టు ఎస్సై వై. గణేష్ కుమార్ శుక్రవారం తెలిపారు. తహసీల్దార్ చిన్నారావు సమక్షంలో కోడి పందాల బరులను ట్రాక్టర్‌తో ధ్వంసం చేసినట్లు చెప్పారు. సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. కార్యక్రమంలో వెంట డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ పాల్గొన్నారు.

తిరునాళ్లకు ఏర్పాట్లు



పిల్లల కోసం సిద్ధం చేసిన బ్రేక్ డ్యాన్స్ యంత్రం

కిర్లంపూడి: సంక్రాంతి పండగను పురస్కరించు కుని కిర్లంపూడిలో తిరునాళ్ల నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే తిరునాళ్లకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం పిల్లల వినోద యాంత్రిక సామాగ్రి అమర్చారు. రోడ్డుకు ఇరువైపులా బొమ్మలు, దుకాణాల ఏర్పాట్లతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

రసాభాసగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



సమావేశపు హాలులో నేలపై కూర్చుని నిరసన తెలుపుతున్న ఎంపీటీసీలు, సర్పంచులు

- ఒకరికొకరు పరస్పర ఆరోపణలు
- ప్రస్తావనకు రాని ప్రజాసమస్యలు

ఏలేశ్వరం: పరస్పర ఆరోపణలతో మండల సర్వ సభ్య సమావేశం అర్ధంతరంగా ముగిసింది. సభ్యుల ఆరోపణలతో ప్రజా సమస్యలను ప్రస్తావించకుండానే సమావేశం వాయిదా వేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. తొలుత ప్రజా సమస్యలపై చర్చ ప్రారంభించగా ఎంపీటీసీ సభ్యులు తమపై ఎంపీపీ వర్గీయులు సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఎంపీటీసీలు, సర్పంచులు నేలపై కూర్చుని ప్లకార్డులతో నిరసన తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చిన అనుచిత వ్యాఖ్యలకు ఎంపీపీ బుజ్జి క్షమాపణలు చెప్పారు. అప్పటికీ శాంతించని ఎంపీటీసీలు, సర్పంచులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. సమావేశం ముగించుకుని త్వరగా బయటకు రావాలని వాకౌట్ చేసిన సభ్యులు అధికారులను కోరారు. సమస్యలు ప్రస్తావించకుండా బయటకు రావాలని కోరడంతో ఎంపీపీ అర్ధంతరంగా సమావేశాన్ని వాయిదా వేశారు. ఎంపీపీ, ఎంపీటీసీల వివాదంతో గ్రామాల్లోని సమస్యలు చర్చకు రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. వారి మధ్య వివాదంపై మండలస్థాయి అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సమావేశంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ నిర్మాణ పనుల పరిశీలన

కిర్లంపూడి: స్థానిక ప్రభుత్వాసుపత్రి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ పనులను శుక్రవారం జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్ నల్లా రాజశేఖర్‌ను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా ఆడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాసరావు, పెద్దాపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ వెంకటేశ్వరావు, జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు, కిర్లంపూడ ఎస్సై బి.తిరుపతిరావు ఉన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

తుని: విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు తుని పట్టణ ఎస్ఐ సతీష్ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం బంగారయ్యపేటకు చెందిన విద్యార్థిని తుని పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతోంది. ఈ నెల 5వ తేదీ నుంచి కనిపించడం లేదు. బంధువుల ఇళ్ల దగ్గర వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తల్లి జగమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు.

కొండపోడు భూములకు పట్టాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- నెల రోజుల్లో పట్టాలు పంపిణీ చేస్తామని వెల్లడి



గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: గోకవరం, జగ్గంపేట మండలాల్లో కొండుపోడు భూములను సాగు చేసుకుంటున్న 400 మంది నెల రోజుల్లో పట్టాలు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు. మండలంలోని గోవిందపురంలో శుక్రవారం ఎస్సైన్‌మెంట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. కొండపోడు పట్టాలకు దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని జగ్గంపేట మండలంలోని గోవిందపురం, మన్యవారిపాలెం, కృష్ణాపురం, గోకవరం మండలంలోని భూపతిపాలెం, కళుజోళ్ల, మల్లవరం గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీలు నిరుపయోగంగా ఉన్న కొండపోడు భూమిని బాగు చేసుకుని సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వీరంతా తాము సాగు చేసుకుంటున్న కొండపోడు భూములకు పట్టాలు ఇవ్వాలని గత 20 సంవత్సరాలుగా కోరుతున్నా ఏ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన కొండపోడు పట్టాలు పేదలకు ఇవ్వడానికి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ మేరకు గోవిందపురం, మన్యవారిపాలెం, కృష్ణాపురం గ్రామాలకు చెందిన లబ్ధిదారుల ఎంపిక గోకవరం తహసీల్దార్ శ్రీనివాస్ పర్యవేక్షణలో చేపట్టినట్లు వివరించారు.

సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

గోవిందపురంలో వైఎస్సార్ సీపీ నేత, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరక్టర్ అప్పారావు కాపు ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు.ఆట పాటలతో సందడి చేశారు. దుర్గమ్మ జాతర సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కృష్ణుని గుడి వద్ద నిర్మించిన కాంపౌడ్ వాల్‌ను ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమాల్లో జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, వైఎస్సార్ సీపీ నేతలు ఇళ్ల అప్పారావు కాపు, కంచిలక్ష్మణదొర, కల్యాణ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

తొండంగి: మండలంలోని గోపాలపట్నం, శృంగవృక్షం గ్రామాల్లో అగ్ని ప్రమాద బాధితులకు 'నాసా' స్వచ్ఛంద సంస్థ శుక్రవారం ఆర్థిక సాయాన్ని అందజేసింది. గోపాలపట్నంలో పలివెల లక్ష్మికి చెందిన వరికుప్ప, శృంగవృక్షంలో ద్రాక్షారపు దుర్గ, అడ్డాల రాణికి చెందిన పూరి గుడిసెలు ఇటీవల దగ్ధమయ్యాయి. ఆయా బాధిత కుటుంబాలకు 'నాసా' స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా బియ్యం, నిత్యావసర వస్తువులు, వంటపాత్రలు, దుప్పట్లు, చీరలు, టవల్స్, లుంగీలతో పాటు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గోపాలపట్నం సర్పంచ్ బి.శివశంకర్, శృంగవృక్షం సర్పంచ్ డి.అప్పన్న, నాసా సంస్థ సిబ్బంది ఆర్.నాగేశ్వరరావు, బీకే మూర్తి, వై.శ్యామ్, ఆర్.హేమలత, జి.గోపి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



ఎస్.అన్నవరంలో స్వీపర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ సత్య నాగేశ్వరరావు



తుని మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు దుస్తులను పంపిణీ చేస్తున్న బాలు

తుని రూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని ఎస్.అన్నవరం మేజరు పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి మధుశేఖర్ ఆధ్వర్యంలో 26 మంది కార్మికులకు రెండేసి జతల దుస్తులు, స్వీట్లను వైస్ ఎంపీపీ సత్య నాగేశ్వరరావు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కుసనం దొరబాబు, వంగలపూడి వాసు, వంగలపూడి కృష్ణారావు, కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ

తుని: సంక్రాంతి పండగను పురస్కరించుకొని పట్టణలో పారిశుధ్య కార్మికులకు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ ప్రసాదరాజు ఆధ్వర్యంలో 60 మందికి చీరలు, టవల్స్, దుస్తులను కోమున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు అందజేశారు. ఇన్‌చార్జి డీఈఈ ప్రకాశరావు, ప్రజా ఆరోగ్య శాఖ అధికారి శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు దుస్తుల పంపిణీ

కిర్లంపూడి: మండలంలోని చిల్లంగి చెప్పుల వెంటరత్నం చర్చిలో శుక్రవారం నిరుపేద కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేశారు. చెప్పుల బాబూరావు వర్ధంతి సందర్భంగా మాజీ ఎంపీటీసీ చెప్పుల బుచ్చమ్మ ఆధ్వర్యంలో సుమారు 100 మందికి చీరలు, దుప్పట్లు, లుంగీలు, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో పాస్టర్ జ్యోతిబాబు, రత్నంరాజు, రాజేష్, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

- ముగిసిన క్రీడా పోటీలు
- ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు



శంఖవరంలో తెలుగు వంటకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్, ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు



కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే పర్వత ప్రసాద్, ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు



హంసవరంలో మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న సర్పంచ్, న్యాయ నిర్ణేతలు



కోలాట ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

శంఖవరం: తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన సంక్రాంతి ప్రతిఒక్కరికీ ఆనందదాయకమైనదని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్, జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు అన్నారు. స్థానిక పాత ఆసుపత్రి ఆవరణలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న సంక్రాంతి సంబరాలు శుక్రవారంతో ముగిశాయి. గ్రామీణ ప్రాంత సంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన పొట్టేళ్లు, తప్పెడుగుళ్లు, కోలాటం, మట్టి కుండల తయారీ, ఎడ్లు, గిత్తలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారుల నృత్యాలు, కోలాటం, వివిధ రకాల వేషధారణలు, హరిదాసు కీర్తనలతో క్రీడా ప్రాంగణం మార్మోగింది. మహిళలు రంగవల్లులతో అలరించారు. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో గ్రామీణ క్రీడాకారులు పాల్గొని సత్తా చాటారు. కబడ్డీ పోటీల విన్నర్‌గా కాకినాడ జట్టు, రన్నర్‌గా సామర్లకోట జట్టు నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్యే పర్వత ప్రసాద్, ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు బహుమతులు అందజేశారు. అదనపు ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీలు ఎం.వెంకటేశ్వరరావు, అంబిక ప్రసాద్, ఎంపీపీ పర్వత రాజబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు తురం రాజేశ్వరి, ప్రత్తిపాడు సీఐ కిశోర్‌బాబు, ఎస్సైలు శోభన్‌కుమార్, అజేయ్‌బాబు, సుధాకర్ పాల్గొన్నారు.

తుని రూరల్: మండలంలో హంసవరం, తాళ్లూరు గ్రామాల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. హంసవరంలో రూరల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు వాలీబాల్, క్రికెట్, ముగ్గులు, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్పంచ్ రాయి మేరీఅవినాష్, రూరల్ ఎస్సై ఎ.బాలాజీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. హెచ్.కొత్తూరు సర్పంచ్ కె.సుబ్బారావు, మాజీ సర్పంచ్ అత్తి వెంకటరమణ, ఆర్‌సీఎం చర్చి పాదర్ ప్రతాప్ కుమార్, కార్యదర్శి శంకర్, నాయకులు రాయి దాసు, రాయి పాపారావు పాల్గొనారు. తాళ్లూరులో వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

గండేపల్లి: మండలంలోని మురారి రామాలయం వద్ద శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. వసంత్ యువసేన ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంపీపీ చలగళ్ల దొరబాబు, గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్ బహుమతులు అందజేశారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



కుండీల్లో నిల్వ ఉంచిన నీటిని పారబోస్తున్న ఆరోగ్య సిబ్బంది

జగ్గంపేట: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జగ్గంపేట గ్రామ ఉపసర్పంచ్ బండారు రాజా అన్నారు. రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గౌతమి ఆధ్వర్యంలో జగ్గంపేటలో శుక్రవారం డ్రై డే- ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఉపసర్పంచ్, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఉపసర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.